దైవ చింతనతో మానసిక ప్రశాంతత

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట, జూన్ 30: దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట డివిజన్ పరిధి అవంతి నగర్ తోటలోని షిర్డీ సాయిబాబా ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒత్తిడి ప్రపంచంలో ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉదయ్, ఆలయ కమిటీ సభ్యులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

మాధవరం రామయ్య పటేల్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అవంతినగర్ తోటలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

మాధవరం రామయ్య పటేల్ విగ్రహావిష్కరణ

మాధవరం రామయ్య పటేల్ 85వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ లోని దేవినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పటేల్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ఆవిష్కరించారు. సమాజానికి రామయ్య చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్,జూన్ 30 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

కూకట్‌పల్లి సీఐగా ముత్తు

ముత్తు, కూకట్‌పల్లి సీఐ

మూసాపేట, జూన్ 30: కూకట్‌పల్లి సీఐగా కె.ముత్తు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ కృష్ణమోహన్ నూతన సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎస్సైలు, సిబ్బంది, స్థానిక నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

మాదాపూర్ సీఐగా కృష్ణమోహన్

మాదాపూర్ : సైబరాబాద్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాదాపూర్ సీఐ గడ్డం మల్లేశ్‌ను జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కూకట్‌పల్లి సీఐగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌ను మాదాపూర్‌కు బదిలీ చేశారు. కాగా కృష్ణమోహన్ ఆదివారం సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

పెండింగ్ పనులను పూర్తి చేయిస్తా..

● కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జూన్ 30 : కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం నియోజకవర్గానికి చెందిన వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీల్లో పేరుకుపోయిన అంతర్గత సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కట్ట మైసమ్మ బోనాలు

మేడ్చల్, జూన్ 30: మేడ్చల్‌లో పెద్ద చెరువు కట్టపై కొలువై ఉన్న మైసమ్మ బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం సాయంత్రం పండుగ నిర్వహణ కార్యక్రమాలను ప్రారంభించారు. శనివారం రాత్రి వరకు ఘటం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకొని, అమ్మవారికి సమర్పించారు. పాలకవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మల్లంపేట్‌లో సీసీ రోడ్డు ప్రారంభం

మల్లంపేట్‌లో పర్యటిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, జూన్ 30 : ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన దుండిగల్ 23వ వార్డులోని మల్లంపేట్‌లో పర్యటించారు. స్థానికంగా ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును కౌన్సిలర్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు పాలకవర్గం పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాసు వెంకటేశం తదితరులు ఉన్నారు.

అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆదివారం కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కౌన్సిలర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు లలిత

రామంతాపూర్,జూన్ 30: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఉప్పల్ డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు ముషం కిరణ్,ఐద్వా ఉప్పల్ కార్యదర్శి జే. లలిత మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన రూ.2500 ఆర్థిక సహాయం, గ్యాస్ సబ్సిడీ,ఉచిత కరెంట్, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వాలన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను మిగిలిన డబుల్ బెడ్ రూంలను పేదలకు ఇవ్వాలన్నారు.

నర్ల సురేశ్‌కు 'సేవారత్న' అవార్డు

మల్కాజిగిరి, జూన్ 30: సురేశ్ సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ నర్ల సురేశ్‌కు 'సేవా రత్న' అవార్డు లభించింది. ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన కార్య క్రమంలో పినాకిని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్ అవార్డు అందజేశారు.

ఖబరస్తాన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ఎల్లమ్మబండ ఖబరస్తాన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

మియాపూర్, జూన్ 30 : ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ముస్లింల శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖబరస్తాన్‌లో ఆర్చ్, ప్రార్థనా మందిర నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. రిటైనింగ్ వాల్, పచ్చదనం పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరాజ్, షౌకత్‌అలీ మున్నా, ఫారూక్, ఖాజామియా, సమ్మద్, వాసు, బాలస్వామి, ఫిరోజ్, బషీర్, యాకూబ్, గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

డివిజన్ పరిధిలోని ఖాజానగర్‌కు చెందిన సలామ్, జయశంకర్ కాలనీకి చెందిన యాదగిరి అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, గొట్టి ముక్కల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. వారికి రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 30 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల భరతనాట్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్‌కేఎస్ కళా నిలయం గురువులు సుందరి రవిచంద్ర శిష్య బృందం నృత్యాంజలి, గజానన యుతం, అలరిపు, పంచముఖి కౌతం, శబ్దం, వర్ణం, నర్సింహ కౌతం, భో శంభో, గోవర్ధన గిరిధారి, తక్కువేమి మనకు, అంబా శాంభవి, కళింగ తిల్లాన అంశాలను నివేదిత, పావని, శ్రేయ, వరుని, ప్రవళిక, కిర్మణయి, ఆద్విక, హాసిని, నిధి, అగర్త, గోద్విజ భరతనాట్య రూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు.

విద్యార్థిని అదృశ్యం

ప్రహర్షిణి(ఫైల్)

మూసాపేట, జూన్ 30: నీట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కె.ముత్తు తెలిపిన వివరాల ప్రకరాం.. సూరారానికి చెందిన ప్రహర్షిణి కూకట్‌పల్లిలోని అన్ అకాడమీలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నది. రోజు మాదిరిగాగే శనివారం ఉదయం 9గంటలకు ప్రహర్షిణిని ఆమె తండ్రి సుబ్రమణ్యం ఇన్‌స్టిట్యూట్‌లో దించి తిరిగి సాయంత్రం 6.30 గంటలకు పికప్ చేసుకునేందుకు రాగా ప్రహర్షిణి కనిపించకలేదు. దాంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానికంగా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. వెంటనే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రహర్షిణి ఆచూకీ తెలిసిన వారు 871 2568369 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక పుత్రకామేష్టి యాగ పూజలో పాల్గొన్న భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 30 : శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి పూలంగి సేవ, సుగంధ పుష్పములచే అలంకారం, సహస్రనామార్చన, శ్రీరామలింగేశ్వర స్వామి, ఆదిశంకరాచర్యులకు ప్రత్యేక అభిషేకము, పద్మావతి అమ్మవారికి పూలంగి సేవ, సహస్ర నామార్చన, ఆండాళ్ అమ్మవారికి పూలంగి సేవ, పుష్పములచే సహస్ర నామార్చన, శ్రీలక్ష్మీ గణపతి స్వామికి సుగంధ ద్రవ్య అభిషేకం, అర్చన, ప్రసన్నాంజనేయస్వామికి తేనేతో అభిషేకం, మిరియాలతో సహస్రనామార్చన, సరస్వతి అమ్మవారికి నీల సరస్వతి అలంకారం, అమ్మవారికి శ్వేత కమలములచే సహస్ర నామార్చన, సామూహిక పుత్రకామేష్టి యాగం, గరుఢ హవనము తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ప్రత్యేక పూజలతో పాటు మహాపూర్ణాహుతి, స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతాయని, భక్తులు వేలాదిగా తరలివచ్చి వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

డీఎస్‌కు నివాళి

జగద్గిరిగుట్ట, జూన్ 30: పీసీసీ మాజీ అధ్యక్షుడు డీ.శ్రీనివాస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జగద్గిరిగుట్టలో డీఎస్ మృతికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. లాస్ట్ బస్టాప్‌లో సీనియర్ నేత క్రిష్ణగౌడ్, నరేందర్‌రెడ్డి, గణేశ్, రవీందర్ పాల్గొన్నారు. రాజీవ్‌గృహకల్పలో కౌసల్య, అరుణ్, శ్రీదేవి, చంద్రశేఖర్, బుచ్చిరెడ్డి నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్, తదితరులు డీఎస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వైద్యశిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ రవికిరణ్

దుండిగల్, జూన్ 30 : ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిజాంపేట్ 11వ డివిజన్ కార్పొరేటర్ వాకలపూడి రవికిరణ్ అన్నారు. బాలాజీనగర్‌లోని శ్రీశ్రీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నేత్ర పరీక్షలతో పాటు పలువైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్యం ఖరీదుగా మారిన నేటి పరిస్థితుల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. సుమారు 300 మంది పాల్గొనగా వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది వారికి పలు టెస్టులు నిర్వహిం చారు. కార్యక్రమంలో శ్రీశ్రీ క్లినిక్స్ వైద్యశాల నిర్వాహకులు గంజి శ్రీకాంత్, వివిధ విభాగాల వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 30 : కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) ఇలా ఉన్నాయి.. టమాట 43, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 70, బజ్జి మిర్చి 50, కాకరకాయ 45, బీరకాయ 28, క్యాబేజీ 28, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 30, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 75, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 38, కీర 21, దోసకాయ 23, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 80, ఉల్లిగడ్డ 34, చింతకాయ -, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 9 నుంచి 11, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చిబఠాని -, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, కరివేపాకు 80గ్రా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

భవానీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, జూన్ 30: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం గౌతంనగర్ డివిజన్ సంక్షేమ సంఘం కార్యాలయంలోని క్రీడాకారులకు ఆటవస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని సాయినగర్‌లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. భవానీనగర్‌లో వివిధ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీలీల, శ్రీరామ్, లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, అనిల్, మల్లేశ్‌యాదవ్, కిట్టు, నాగేశ్‌గౌడ్, నర్సింగ్, నర్సింగ్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

జేఏసీ వెంకన్నకు ఎమ్మెల్యే పరామర్శ

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జేఏసీ వెంకన్న అనారోగ్యంతో బాదపడుతూ ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స అందుకుంటున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వెంటనే దవాఖానకు వెళ్లి జేఏసీ వెంకన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా జేఏసీ వెంకన్నకు నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు కొరారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో కి రావాలని దేవుళ్లను కోరుకుంటున్నట్లు తెలిపారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

మూసాపేట, జూన్ 30: మూసాపేట డివిజన్ మోతీనగర్ వార్డు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలు, బస్తీల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా కాలనీలవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

నిజాంపేట్ మేయర్‌కు సమస్యల వినతి

మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను కలిసిన ఇందిరమ్మ కాలనీవాసులు

దుండిగల్,జూన్ 30 : తమ బస్తీలు,కాలనీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని పలువురు ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. హిల్‌కౌంటీలోని మేయర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-3కి చెందిన నాయకులు తమబస్తీలో సమస్యలను పరిష్కరించాలని మేయర్‌ను కోరారు.

● నిజాంపేట్ 4వ డివిజన్ నాయకులతో పాటు ప్రజాస్వామ్య వాదుల ఐక్యవేదిక సభ్యులు మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్, సుబ్బు, ఓంకార్, చంద్ర, వెంకట్రావ్, జగదీశ్, మహేశ్‌రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మల్కాజిగిరి, జూన్ 30: విదేశాల్లో చదువుకుంటున్న బ్రాహ్మణ విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్‌బాగ్‌లోని ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశీవిద్యా పథకంలో స్కాలర్‌షిప్‌ను పొంది అక్కడ చదువుతున్న విద్యార్థులకు సమయానికి స్కాలర్‌షిప్ అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్పొరేటర్ శ్రవణ్, రామకృష్ణ, పర్వత వర్ధిని, భారతి, శ్రీనివాసరావు, వై శ్రీనివాస్‌రావు, చంద్రమౌలి, నాగరాజు, రఘునందన్, కుల్కర్ణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి

తూంకుంటలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరైన విద్యార్థులు

శామీర్‌పేట, జూన్ 30 : గ్రామీణ విద్యార్థుల్లో మంచి క్రీడా నైపుణ్యం దాగిఉంటుందని వారికి సానపెట్టి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దవచ్చునని మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కూరపాటి రాజశేఖర్ అన్నారు. తూంకుంటలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో ఆదివారం మేడ్చల్ జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి అండర్ 8, 10, 12 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 8, 10, 12 విభాగాల్లో 50 మీటర్ల, 100 మీటర్లు, 300 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, క్రీడా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. మేడ్చల్ జిల్లా జట్టు తరపున క్రీడాకారులు ఈనెల7న హైరాబాద్‌లో పుల్లెల గోపిచంద్ అకాడమీ అథ్లెటిక్స్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు అశోక్‌కుమార్, దయాల్, శేఖర్, సురేందర్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలాజీహిల్స్‌లో సమస్యలు పరిష్కరిస్తా..

దుండిగల్,జూన్ 30 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాలాజీ హిల్స్ కాల నీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అన్నారు. ఆదివారం బాలాజీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేఎస్ఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషిచేస్తానన్నారు.